క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో కొలువైన కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మాఘ మాసం మంగళవారం సందర్భంగా స్వామి వారికి భారీగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు.

చదువుకు ఆర్థిక సాయం

రాజానగరం: తండ్రి హఠాన్మరణంతో చదువుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్న పల్లకడియం మాజీ సర్పంచ్ గుత్తుల ఆదినారాయణ ఇద్దరు కుమార్తెలకు దివాన్ చెరువుకు చెందిన మాజీ వైస్ ఎంపీపీ, రాష్ట్ర గౌడ సాధికార సమితి డైరెక్టర్ వంక మల్లిబాబు రూ. 25 వేలు ఆర్థిక సాయాన్ని మంగళవారం అందజేశారు. ఇద్దరు అమ్మాయిలలో ఒకరు 10వ తరగతి, మరొకరు ఇంటర్మీడియట్ చదువుతున్నారు.

సారా తరలిస్తున్న వ్యక్తికి రిమాండ్

సీతానగరం: మండలంలోని బొబ్బిల్లంకకు చెందిన మార్గాని నాగేశ్వరరావుకు కోర్టు రిమాండ్ విధించిందని ఎస్సై టి.రామకృష్ణ మంగళవారం తెలిపారు. బొబ్బిల్లంక శివారున సారా తరలిస్తున్న అతడిని అరెస్ట్ చేసి, 60 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారన్నారు.

ఒత్తిడిని అధిగమిస్తే సత్ఫలితాలు



డాక్టర్ కర్రి రామారెడ్డిని సత్కరిస్తున్న డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సూర్యనారాయణ

రాజమహేంద్రవరం రూరల్: ఒత్తిడిని అధిగమించి సంతృప్తికరమైన జీవన విధానాన్ని అలవరుచుకోవాలని ప్రముఖ మానసిక వైద్యనిపుణులు డాక్టర్ కర్రి రామారెడ్డి అన్నారు. మంగళవారం బొమ్మూరు జిల్లా ప్రభుత్వ విద్యాశిక్షణా సంస్థ(డైట్)లో ఆయన ఛాత్రోపాధ్యాయులకు 'స్ట్రెస్ మేనేజ్మెంట్'పై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఒత్తిడి వల్ల కలిగే దుష్ఫలితాలను, ఒత్తిడిని అధిగమించి సంతృప్తికరమైన జీవనవిధానాన్ని ఎలా అలవరుచుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ఆ అంశంపై ఛాత్రోపాధ్యాయుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో విద్యావికాస్ పరిషత్ కో ఆర్డినేటర్ జి.కోటేశ్వరరావు, సభ్యులు ఎం.సూర్యనారాయణ, దాట్ల వర్మ, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేవీ సూర్యనారాయణ, అధ్యాపక సిబ్బంది జానకీదేవి, సత్యనారాయణ, గంగాధర్, బాలరాజు, వీరభద్రరావు, రామకృష్ణారావు, ఎస్తర్, కళావతి, రాజేష్ పాల్గొన్నారు.

ఓబీసీ ధ్రువీకరణ పత్రాల మంజూరుకు కృషి



రౌతు సూర్యప్రకాశరావుకు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: తూర్పు కాపు సంఘీయులకు ఓబీసీ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసేందుకు తన వంతు కృషి చేస్తానని రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు హామీ ఇచ్చారు. అనపర్తి నియోజకవర్గం కొంకుదురు గ్రామానికి చెందిన తూర్పుకాపు విద్య, విజ్ఞాన అభివృద్ధి సంఘం సభ్యులు మంగళవారం స్థానిక రౌతు కార్యాలయంలో సూర్యప్రకాశరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రౌతు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఉన్న తూర్పుకాపు సంఘీయులకు మాత్రమే ఓబీసీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నారని, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో ఉన్న ఆ సంఘీయులు ఓబీసీ ధ్రువీకరణకు నోచుకోని విషయాన్ని వైఎస్సార్ సీపీ ఎంపీల ద్వారా పలుమార్లు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లినట్లు గుర్తు చేశారు. ధ్రువీకరణ పత్రాలు దక్కని పరిస్థితిలో ఎంతో మంది తూర్పుకాపు యువత విద్య, ఉపాధి రంగాలలో రిజర్వేషన్ ఫలాలను అందుకోలేక పోతున్నారన్నారు. జాతీయ వెనుకబడిన తరగతుల కమిటీ (ఎన్‌సీబీసీ)లో స్థాయి సంఘం సభ్యుడిగా ఉన్న విజయ నగరం ఎంపీ చంద్రశేఖర్‌కు ఈ విషయంపై విజ్ఞప్తి చేశానని, ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. కొంకుదురులో తుది దశ నిర్మాణంలో ఉన్న తూర్పుకాపు విద్య, విజ్ఞాన అభివృద్ధి సంఘం కల్యాణ మండపం నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

మారుమూల రోడ్లకూ మహర్దశ

- చురుగ్గా అభివృద్ధి పనులు
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చొరవతో శ్రీకారం

మధురపూడి: గ్రామాల అభివృద్ధి, వ్యాపారాల పెరుగుదలకు రోడ్లు చాలా అవసరం. అవి సక్రమంగా ఉన్నప్పుడే రాకపోకలు పెరుగుతాయి. తద్వారా అభివృద్ధి సాధ్యమవుతుంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా చొరవతో నియోజకవర్గంలోని రహదారులకు మహర్దశ పట్టింది. ముఖ్యంగా మారుమూల గ్రామాలను అనుసంధానం చేస్తూ రోడ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

69 పంచాయతీలు

రాజానగరం నియోజకవర్గంలోని కోరుకొండ, రాజానగరం, సీతానగరం మండలాల్లో 69 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషితో మారుమూల 12 గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వీటి నిర్మాణం పూర్తయితే రైతులు పొలాలకు, వ్యవసాయ కూలీలు పనులకు, వాహన చోదకుల రాకపోకలు సులభతరమవుతాయి. దీనిలో భాగంగా 4 గ్రామాల మధ్య నిర్మాణ పనులు జోరందుకున్నాయి. పీఎంజీఎస్‌వై నిధులతో మరో రెండు గ్రామాలను అనుసంధానం చేస్తూ పనులు జరగనున్నాయి.



మిర్తిపాడు - బుచ్చెంపేట గ్రామాల మధ్య జరుగుతున్న రోడ్డు పనులు



కాటవరం - కూనవరం మధ్య నిర్మిస్తున్న రోడ్డు



బుచ్చెంపేట నుంచి మునగాల రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా (ఫైల్)

రాకపోకలకు అవస్థలు

నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలకు చెందిన ప్రజలు రోడ్లు లేకపోవడంతో చుట్టూ తిరిగి పట్టణాలకు, మండల కేంద్రాల్లోని అధికారుల కార్యాలయాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. బుచ్చెంపేట, మిర్తిపాడు, మునగాల, కూనవరం తదితర గ్రామాల వాసులు ఇలా ఇబ్బందులకు గురయ్యేవారు. వీరంతా రాజమహేంద్రవరం, ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే సుమారు 30 కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సి వస్తోంది. దీని కారణంగా ఖర్చుతో పాటు, కాలం వృథా అవుతోంది.

ఎమ్మెల్యే రాజా చొరవతో..

నియోజకవర్గంలోని గ్రామాలను అనుసంధానం చేస్తూ రోడ్ల నిర్మాణం జరగాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే రాజా పనిచేస్తున్నారు. ఈ పనులకు సంబంధించి సుమారు 12 ప్రతిపాదనలు పంపారు. సీతానగరం మండలం బొబ్బిలంక నుంచి బుచ్చెంపేట వెళ్లే రోడ్డు గతంలో రద్దీగా ఉండేది. కాగా గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధికి నోచుకోలేదు. ప్రస్తుతం నాబార్డ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (నిడా) నిధులు రూ.1.63 కోట్లతో నాలుగున్నర కిలోమీటర్ల విస్తీర్ణంలో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కాటవరం నుంచి కూనవరం వెళ్లే రోడ్డును రూ.1.52 కోట్లతో నిర్మిస్తున్నారు. అలాగే ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) పథకం నిధులు రూ.2.60 కోట్లతో కోరుకొండ మండలం బుచ్చెంపేట నుంచి మునగాల గ్రామానికి నాలుగున్నర కిలోమీటర్లు విస్తీర్ణంలో పనులకు శ్రీకారం చుట్టారు. పనులు ప్రారంభం కానున్నాయి.

త్వరలో మరో పది లింక్ రోడ్లు

నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో మరో పది లింక్ రోడ్ల నిర్మాణానికి అనుమతులు రానున్నాయి. దీంతో మారుమూల గ్రామాల్లో రోడ్లు కళకళలాడనున్నాయి. ప్రతిపాదించిన 12 పనుల్లో 2 ప్రారంభమయ్యాయి, మిగిలిన పది పనులు త్వరలో జరుగుతాయని అధికారుల వెల్లడించారు.

అభినందనీయం



నాడు రోడ్లు భవనాల శాఖ మంత్రిగా జక్కంపూడి రామ్మోహనరావు ఆధ్వర్యంలో గ్రామాలను అనుసంధానం చేస్తూ రోడ్లు నిర్మించారు. నేడు ఆయన కుమారుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అదే తరహాలో రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మారుమూల గ్రామాలను అనుసంధానం చేస్తూ రోడ్లు నిర్మించడం అభినందనీయం.

– మండపాక శ్రీను, రైతు విభాగం జిల్లా కార్యదర్శి

బుచ్చెంపేటకు వెలుగొచ్చింది



మారుమూల ప్రాంతం, గోదావరి వరద ముంపు గ్రామమైన బుచ్చెంపేటకు వెలుగు వచ్చింది. మిర్తిపాడు నుంచి మా గ్రామానికి రోడ్డు, అలాగే ఇక్కడి నుంచి మునగాల గ్రామానికి రోడ్డు పనులు ప్రారంభమవడం సంతోషంగా ఉంది. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. జగనన్న ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది.

– మద్దాల చంటిబాబు, బుచ్చెంపేట

దేశాభివృద్ధిలో యువతదే కీలకపాత్ర

- నన్నయ వీసీ ఆచార్య పద్మరాజు
- ఉత్సాహంగా 'యువ సంవాద్'



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: దేశాభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషించాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె. పద్మరాజు అన్నారు. ప్రపంచంలో ఏ దేశానికి లేనంతగా యువశక్తి భారతదేశానికి ఉందన్నారు. యూనివర్సిటీలోని సెమినార్ హాలులో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో 'యువ సంవాద్ – భారతదేశం 2047' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2047 నాటికి మన దేశం ఏ విధంగా అభివృద్ధి చెందాలని యువత భావిస్తోంది, అందుకు అనుగుణంగా ఎటువంటి లక్ష్యాలను ఎంచుకుంటుందనే విషయాలను తెలుసుకునేందుకు ఇటువంటి కార్యక్రమాలు చక్కటి వేదికలు అవుతాయన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ చెప్పిన పంచ ప్రాణ్ సూత్రాలను యువత పాటిస్తే దేశాభివృద్ధి త్వరితగతిన జరుగుతుందన్నారు. బానిసత్వం, వలస వాద మనస్తత్వం వంటి జాడలను తొలగించడం, మన వారసత్వంపై గౌరవాన్ని పెంచుకోవడం, ఐక్యత, సంఘీభావం, పౌరులలో కర్తవ్యభావం వంటి ఐదు సూత్రాలు దేశాభివృద్ధికి ఎంతో అవసరమన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ సమాజానికి సేవ చేయాలనే దృక్పథం కలిగిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు ఇటువంటి సమాజహితమైన, అభివృద్ధి ప్రణాళికలు వివరించడం ద్వారా భవిష్యత్తుకు బంగారుబాటలు వేయవచ్చన్నారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఆచార్య వై.శ్రీనివాసరావు, సీడీసీ డీన్ ఆచార్య కేఎస్ రమేష్.. ఇండియన్ హెరిటేజ్ అండ్ కల్చర్ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం వక్తృత్వ పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

పాల వెల్లువ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పెదపూడి: పాడి రైతుల అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న పాల వెల్లువ పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి సాయికృష్ణ తెలిపారు. సంపర, పుట్టకొండ, గండ్రేడు, కైకవోలు గ్రామాల్లో జగనన్న పాల వెల్లువపై పాడి రైతులకు అవగాహన సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికృష్ణ మాట్లాడుతూ పాడి రైతులు అందించే పాలకు సముచితమైన రేట్లు ఇప్పించడానికి ప్రభుత్వం అమూల్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుందన్నారు. పాడి రైతులకు సబ్సిడీపై దాణా అందజేస్తారన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, పశువైద్యులు సోనియా, కామేశ్వరరావు, ఇందిర క్రాంతి పథం క్లస్టర్ కోఆర్డినేటర్ పుష్పలత, సర్పంచులు అద్దంకి మాచరమ్మ, వల్లు వెంకటరమణ, కుడిపూడి మాధవీలత, నూని పట్టాభిరామన్న చౌదరి, సచివాలయ కార్యదర్శులు త్రినాథ్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా దిశానిర్దేశం

అనపర్తి: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని మేము సిద్ధం.. మా పోలింగ్ బూత్ సిద్ధం సమావేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మంగళగిరి సీకే కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన 'మేము సిద్ధం...మా పోలింగ్ బూత్ సిద్ధం' సమావేశానికి వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌తో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి హాజరయ్యారు. సమావేశంలో పార్టీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేయడంతో పాటు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ క్లీన్‌స్వీప్ చేసేందుకు, ఎన్నికల నిర్వహణ తదితర అంశాలపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పలు సూచనలు అందించారని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్, పార్టీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చిర్ల వీర్రాఘవరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరావు తదితరులు సీఎం సమావేశంలో పాల్గొన్నారు.



మంగళగిరిలో జరిగిన సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్ తదితరులు

వడిశలేరు సర్పంచ్‌పై కేసు కొట్టివేత

రంగంపేట: వడిశలేరు గ్రామ సర్పంచ్ కొల్లాటి శ్యామలావతి ఎన్నిక చెల్లదంటూ నమోదైన కేసును పెద్దాపురం కోర్టు కొట్టేసిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్ తెలిపారు. మంగళవారం రాత్రి ఆయన మాట్లాడుతూ శ్యామలావతి ఎన్నిక చెల్లదంటూ 2021లో గ్రామానికి చెందిన పోతుల ఉషారాణి, పోతుల రత్నబాబు కేసు వేశారన్నారు. దీనిపై వాదోపవాదాల అనంతరం పెద్దాపురం మున్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గూడూరి హర్షవర్ధన్ మంగళవారం కేసు కొట్టివేశారని చెప్పారు. ఈ సందర్భంగా వడిశలేరు గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు జరుపుకున్నారు.

పర్యావరణ రక్షణ మనందరి బాధ్యత



డిగ్రీ కళాశాలలో మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు

సీతానగరం: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు అన్నారు. ఆ కళాశాలలో మంగళవారం సుమారు 250 మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు తన సొంత నగదుతో సమకూర్చిన మొక్కలను కళాశాల నుంచి ముఖద్వారం వరకూ ఉన్న దారికి ఇరువైపులా విద్యార్థులు నాటారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పచ్చదనం పరిశుభ్రత గల ప్రదేశమే దేవాలయమన్నారు. విద్యార్థులు కళాశాలను పరిశుభ్రంగా ఉంచుతూ, మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ కె.హరే రామ్ మాట్లాడుతూ ప్రకృతిని మనం కాపాడితే.. ఆ ప్రకృతి మనల్ని కాపాడుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ మాధవ్, షేక్ మదీనా, అలేఖ్య, వరలక్ష్మి, మీనాక్షి, ఫణీంద్ర, ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ ఎం.సుధామయి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయం ఖాయం

కుట్రలు, కుతంత్రాలను ప్రజలు విశ్వసించరు : జక్కంపూడి విజయలక్ష్మి



కోటి గ్రామంలో వైఎస్సార్ సీపీలో చేరిన వారితో జక్కంపూడి విజయలక్ష్మి

మధురపూడి: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని ఆ పార్టీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. కుట్రలు, కుతంత్రాలను ప్రజలు విశ్వసించరన్నారు. కోరుకొండ మండలం కోటి గ్రామంలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 150 కుటుంబాలు మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరాయి. ఆ పార్టీలకు చెందిన బర్ల వెంకట్రావు, డీకెల్లి వెంకటేష్ ఆధ్వర్యంలో చేరిన వీరందర్నీ విజయలక్ష్మి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజా విశ్వాసాన్ని పొందిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఓడించాలని ప్రతిపక్షాలు దుర్మార్గమైన పొత్తులు కట్టాయన్నారు.



రాధేయపాలెం నాయకులకు వైఎస్సార్ సీపీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న విజయలక్ష్మి

జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కాపు సామాజికవర్గాన్ని చంద్రబాబు పాదాల వద్ద ఉంచారని దుయ్యబట్టారు. రాజానగరం నియోజకవర్గంలో రూ.1,158 కోట్లతో అభివృద్ధి పనులు, రూ.1,142 కోట్లతో సంక్షేమ పథకాలను అమలు జరిపినట్టు తెలిపారు. సచివాలయాలు, హెల్త్ సెంటర్లు, ఆర్బీకే భవనాలతో గ్రామాలకు ప్రత్యేక కళను తీసుకొచ్చామన్నారు. సర్పంచ్ వెంటపాటి దుర్గారావు, ఎంపీటీసీ సభ్యుడు గట్టి వీర ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు అడపా కుమార్, అడపా బాబి, సీతా వెంకటేశ్వరరావు, రాయపాటి స్వామి, గట్టి శేఖర్, గట్టి నాగేశ్వరరావు, అడపా సత్యనారాయణ, నందూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి..

రాజానగరం: రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు ఆకర్షితులై ప్రతిపక్షాలకు చెందిన ఎంతోమంది వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. వచ్చిన వారంతా అంకితభావంతో పనిచేసి, రాబోయే ఎన్నికలలో అత్యధిక మెజార్టీతో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు విజయకేతనం ఎగురవేసేలా కృషి చేయాలన్నారు. మండలంలోని రాధేయపాలెంలో టీడీపీకి చెందిన కొంత మంది కార్యకర్తలు జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి జక్కంపూడి విజయలక్ష్మి స్వాగతం పలికారు.

ఆహార భద్రత పాటించకపోతే చర్యలు



తనిఖీ చేస్తున్న అనంతరావు తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: ఆహార తయారీ సంస్థలు, రెస్టారెంట్లు, బేకరీలు తప్పనిసరిగా ఫుడ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ఆహార భద్రతా నియమాలు పాటించాలని రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు, జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ వి.రుక్కయ్య అన్నారు. నగరంలోని పలు రెస్టారెంట్లను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అనంతరావు మాట్లాడుతూ ఆహార భద్రత ప్రతి ఒక్కరి హక్కు అన్నారు. ఫిర్యాదులు ఏమన్నా ఉంటే బొమ్మూరులోని జిల్లా ఫుడ్ సేఫ్టీ కార్యాలయానికి తెలియజేయాలన్నారు. ఆహారం తయారుచేసే వంటగదిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, టేస్టింగ్ సాల్ట్ వాడటం చట్టరీత్యా నేరమన్నారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రుక్కయ్య మాట్లాడుతూ హోటళ్ల నుంచి ఆహార పదార్థాలను సేకరించామని, వాటిని ల్యాబ్‌కు పంపించి రిపోర్ట్ ఆధారంగా జాయింట్ కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సీఎస్డీటీ నాగలక్ష్మి, ఎంఎస్ఓ ప్రభాకర్, ఫుడ్ సేఫ్టీ సిబ్బంది పాల్గొన్నారు.

69 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సీతానగరం: ఇనుగంటివారిపేటలోని శ్రీషిర్డీ సాయిబాబా మందిరం 16వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీద్వారకామాయి ఫంక్షన్ హాల్లో లయన్స్ క్లబ్ ఆఫ్ రాజమండ్రి సెంటిన్నియల్ పవర్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరానికి చెందిన గౌతమీ నేత్రాలయానికి చెందిన జి.కమలేష్, కె.సత్య ఈ శిబిరంలో 69 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 15 మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు చేయాలని, 14 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో శ్రీసాయి సేవాసమితి ఇనుగంటివారిపేట చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ లక్ష్మి, వైస్ చైర్మన్ సత్యం మోహనరావు, లయన్ కొల్లూరి గోపాలకృష్ణ, లయన్ సలాది శ్రీనివాస రావు, సత్యం మదన్‌బాబు, తన్నీరు నాగేశ్వరరావు, సత్యం నారాయణరావు, సర్పంచ్ సత్యం రాంపండు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన కల్పించాలి



దివాన్‌చెరువులో పోలింగ్ బూత్ వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

రాజానగరం: ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు హక్కు వజ్రాయుధమని, దానిని ప్రతి ఓటరు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కలిగించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత అన్నారు. మండలంలోని దివాన్‌చెరువు, లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలలో గత ఎన్నికలలో తక్కువ శాతం పోలింగ్ జరిగిన ప్రాంతాలను మంగళవారం సాయంత్రం సందర్శించారు. సంబంధిత అధికారులతో బూత్‌ల వారీగా సమీక్షించారు. గత ఎన్నికలలో ఓటింగ్ శాతం తక్కువగా నమోదైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి, ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను చేపట్టాలని సిబ్బందికి సూచించారు. రాజ్యాంగం కల్పించిన కల్పించిన ఓటు హక్కును సక్రమంగా వినియోగించడం పౌరుల బాధ్యత అన్నారు. గత ఎన్నికలలో 65 శాతం కంటే తక్కువ ఓటింగ్ జరిగిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి, అందుకు గల కారణాలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేస్తున్నామన్నారు. ఇప్పటికే ఈవీఎంల వినియోగంపై ఓటర్లకు అవగాహన కలిగిస్తూ, రాబోయే ఎన్నికలలో నూరు శాతం ఓటింగ్ జరిగేలా ప్రయత్నం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఆర్డీఓ, రాజానగరం నియోజకవర్గ ఎన్నికల అధికారి ఎ. చైత్రవర్షిణి, తహసీల్దార్ జి.కనకరాజు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.